క్లుప్తంగా

నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యం



రక్తదాన శిబిరం

రాయికల్: నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యంగా త్యాగం ఫౌండేషన్ ఆవిర్భవించినట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో త్యాగం ఫౌండేషన్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఖమ్మం అన్నం సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాస్‌రావు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, ఇటిక్యాల సర్పంచ్ సామల్ల లావణ్య, కౌన్సిలర్లు ఎలిగేటి అనిల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సాయికుమార్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కట్కం లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కాళ్లు, చేతులు పడిపోయి ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నాడు. కాగా ఆయన దీనగాథ తెలుసుకున్న 1997–98లో పదో తరగతి చదివిన అతడి స్నేహితులు కలిసి లక్ష్మీనారాయణకు రూ.35,500 అందజేశారు. నాయకులు కల్లెడ వేణు, దండవేని గంగరాజు, నరేశ్, దాసరి శివకుమార్, రాపర్తి జలేందర్, ఆడెపు గంగాధర్, హన్మండ్లు, జంగ మల్లయ్య, విష్ణు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

రాయికల్: రాయికల్ వ్యవసాయ మార్కెట్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మార్కెట్‌యార్డు అనేది రైతులకు సంబంధించిన భూమి అని, రైతులు ధాన్యం నిల్వ ఉంచుకునే ప్రదేశమని, పట్టణానికి చివరిగా ఉన్న మార్కెట్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టొదన్నారు. పట్టణంలో ఏ ఇతర ప్రాంతాల్లోనైనా సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ధర్నా విరమించారు. అనంతరం తహసీల్దార్ అనిల్‌కు వినతిపత్రం సమర్పించారు.

డీఎంకు సన్మానం



డీఎంను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల: విద్యార్థులకు ప్రజల సౌకర్యార్థం జగదేవ్‌పేట, కొండాపూర్, ఎండపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించగా వెంటనే ఏర్పాటు చేశారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఎంను కలిసి సన్మానించారు. నాయకులు బచ్చల వినోద్, జీవన్, చిర్ర రాజేశ్ పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం



పనులు ప్రారంభించిన జెడ్పీటీసీ సుధారాణి

వెల్గటూర్: కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీసీరోడ్డు సమస్యకు పరిష్కారం దొరికిందని జెడ్పీటీసీ సుధారాణి అన్నారు. ఈ మేరకు వెల్గటూర్ మండల కేంద్రంలోని మహాలక్ష్మీ కాలనీలో సోమవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు, జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేరుగు మురళి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఉపసర్పంచ్ సందీప్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు రంగు తిరుపతి, ఎర్రోల్ల మహేశ్, శివ రాజం పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో గదుల కొరత

- తరగతి గదుల్లో ల్యాబ్, ఆర్‌వో ప్లాంట్
- అధ్యాపకుల విశ్రాంతి గదిలో తరగతి నిర్వహణ
- ఇదీ సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల దుస్థితి



క్లాస్‌రూంలో ఆర్‌వో ప్లాంట్



తరగతి గదిలో ల్యాబ్

సారంగాపూర్: మారుమూల ప్రాంతాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలన్న ఆలోచనతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచన విధానానికి ప్రతిరూపం అప్పటి ఉమ్మడి సారంగాపూర్ మండలంలో ఏకకాలంలో సారంగాపూర్, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను 2008లో ప్రారంభించారు. ప్రస్తుతం 210 మంది విద్యార్థులు ఆంగ్ల, తెలుగు మీడియంలో విద్యనభ్యసిస్తున్నారు. 2015లో రూ.63.40లక్షలు ఐపీఏ నిధులతో పక్కా భవనాన్ని నిర్మించారు. కానీ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

గదుల కొరత తీవ్రం..

✦ మొత్తం తరగతి గదులు 4, ఆఫీస్ రూం, స్టాఫ్ రూం ఉన్నాయి.

✦ తరగతి గదులతో పాటు, ఆఫీస్‌రూం, స్టాఫ్‌రూంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు.

✦ ఒకే గదిలో ల్యాబ్‌లో విద్యార్థులు ప్రయోగాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఇతర తరగతి విద్యార్థులకు మరో సబ్జెక్టులో తరగతి నిర్వహించడంతో విద్యార్థులకు, చదువులో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

✦ మరో గదిలో తరగతి గదితో పాటు ఆర్‌వో ప్లాంట్ (ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్) ఉండడంతో చదువుకు అంతరాయం జరుగుతోంది.

✦ విద్యార్థులకు లైబ్రరీకి గది లేక పుస్తకాలను బాత్రూంలో భద్రపరచి, అవసరమున్న పుస్తకాలను విద్యార్థులు తీసుకెళ్లి బయట చదువుకోవాల్సి వస్తోంది.

మరో ఆరుగదులు అవసరం..

ప్రస్తుతం ఉన్న కళాశాలపైన మరో 6గదులు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇందులో నాలుగు గదులను బోటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ ల్యాబ్‌ల కోసం అవసరం ఉండగా, రెండు గదులు తరగతులు నిర్వహించడానికి అవసరం ఉన్నాయి. గదులు నిర్మించి తమ సమస్యలు తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



గదుల కొరత కారణంగా చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గదుల కొరత తీర్చడానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్ నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించాలి.

– గంగోత్రి, విద్యార్థిని

గదుల కొరత తీవ్రం



తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. కనీసం 6 నుండి 8 గదులు నిర్మిస్తే తరగుతుల నిర్వాహణకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఒకేషనల్ కోర్సులు ప్రారంభించడానికి అవకాశం ఉంది.

– కొంక వేణు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

జగిత్యాలటౌన్/పెగడపల్లి/కోరుట్ల,కోరుట్లరూరల్/ఇబ్రహీంపట్నం/రాయికల్/కథలాపూర్/మల్లాపూర్/సారంగాపూర్: జిల్లావ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



కోరుట్ల, కోరుట్లరూరల్: సి.ప్రభాకర్ గ్రంథాలయంలో



రాయికల్: కుమ్మరిపల్లిలో నివాళి



ఇబ్రహీంపట్నం: నివాళి అర్పిస్తున్న యువకులు



పెగడపల్లి: నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



కథలాపూర్: సిరికొండలో..

ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలి

మేడిపెల్లి: భీమారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట విద్యుత్ ఏసీడీ చార్జీలు రద్దు చేయాలంటూ సోమవారం గ్రామస్తులు ధర్నాకు దిగారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు భారీగా పెంచిన ప్రభుత్వం, ఏసీడీ చార్జీలు అంటూ మరో భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించారు. అనంతరం బైక్‌పై ర్యాలీగా వెళ్లి విద్యుత్ ఏఈకి వినతిపత్రం సమర్పించారు. గుగ్గిల్ల రవి, కోటగిరి లింగం, ఉరుమడ్ల లక్ష్మణ్, పల్లిపాల భీమయ్య, కల్లెడ వినయ్, వెంకట్‌రెడ్డి, నరేశ్, దీపక్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో..

కొడిమ్యాల: మండలంలోని రాంసాగర్, తిమ్మయ్యపల్లి, హిమ్మత్‌రావుపేట శనివారంపేట్ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు సోమవారం జగిత్యాలలో ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధన్నపునేని రాంచందర్‌రావు, నీలగిరి గంగారావు, బల్కం మహేశ్, బొల్లారపు శంకర్, తబ్బేటి రాజయ్య, బోలుమల్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మేడిపెల్లి: ధర్నా చేస్తున్న గ్రామస్తులు

వెంటనే ఉపసంహరించుకోవాలి

మల్యాల: వినియోగదారులపై అదనపు చార్జీల డిపాజిట్ భారం మోపొద్దని, వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల భూమారెడ్డి కోరారు. భవిష్యత్ అవసరాల పేరిట గతంలో డెవలప్‌మెంట్ డిపాజిట్ల పేర దోచుకున్నారని, మరోసారి అడిషనల్ చార్జీల పేరిట వసూలు చేయడం సరికాదన్నారు. వెంటనే ఏసీడీ ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రైతువేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు.

గౌడ సంఘం భవనానికి రూ.5లక్షలు మంజూరు



మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి గ్రామ గౌడ సంఘం భవన నిర్మాణం కోసం రూ.5లక్షలు మంత్రి ఈశ్వర్ మంజూరు చేశారు. కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతతో కలిసి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాన్ని గౌడ సంఘం నాయకులకు అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, గౌడ సంఘం నాయకులు కిషన్‌గౌడ్, బాలుసాని లచ్చగౌడ్, భాస్కర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు మడిగల తిరుపతి పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం



కోరుట్ల: పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ప్రారంభించారు. సీనియర్, జూనియర్ జట్లను విభజించి పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారి, ప్రిన్సిపాల్ సెలీనా బారి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నేతాజీ యూత్ అధ్యక్షుడిగా అస్లాం

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి నేతాజీ యూత్ అధ్యక్షుడిగా మహ్మద్ అస్లాం, ఉపాధ్యక్షుడిగా పాలిక రాజశేఖర్, కొడిమ్యాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి శేఖర్, కోశాధికారిగా దొంతి మధు, ముఖ్య సలహాదారులుగా పంచతి రాజేందర్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

✦ బిల్లులు చెల్లించి ఆదుకోండి

కొడిమ్యాల: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేసిన పనులకు బిల్లులు చెల్లించి ఆదుకోవాలని మండలంలోని దమ్మయపేట సర్పంచ్ తునికి నర్సయ్య వాపోయాడు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. దమ్మయపేట గ్రామంలోని వడ్డెరకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ రూ.20లక్షలతో కాంపౌండ్‌వాల్ నిర్మించి నెలరోజులు గడుస్తోందని, పనులు పూర్తయిన వెంటనే వాటిని చెల్లిస్తామని అధికారులు చెప్పారని, తీరా పనులు పూర్తయి నెలరోజులైనా బిల్లులు మంజూరు కావడంలేదని వాపోయారు. కలెక్టర్ చొరవ తీసుకొని బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

✦ క్రీడాకారులకు బ్యాట్లు, టీషర్టుల పంపిణీ

వెల్గటూర్: ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో జరుగుతున్న ఎమ్మెల్యే రూలింగ్ కప్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న ముత్తునూర్ క్రికెట్ టీం సభ్యులకు సోమవారం స్థానిక సర్పంచ్ అనుమాల తిరుపతి బ్యాట్లు, టీషర్టులు అందజేశారు.

✦ ఆలయంలో పూజలు

సారంగాపూర్: మండలంలోని పెంబట్లలో 102 స్తంభాలతో నిర్మిస్తున్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం మండల ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు.

✦ ఫర్టిలైజర్ డీలర్లకు అవగాహన సదస్సు

ధర్మపురి: ధర్మపురిలోని రైతువేదిక కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఫర్టిలైజర్ల డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాంచందర్ ఆధ్వర్యంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు.

✦ ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో సోమవారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణదారుల యజమానులకు ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై మండల వ్యవసాయ అధికారి దీపిక అవగాహన కల్పించారు.

✦ త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి, జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లిలో సోమవారం యోగి వేమన జయంతిని పురస్కరించుకొని వేమన పద్యాల నిగూఢ తత్వార్థ బోధన, త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం చేశారు. హిందూ త్రైత సిద్ధాంతం జ్ఞానవేదిక ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు రాకేశ్, ఆంజనేయులు, వేణు, నాగేశ్వర్‌రావు, ఆకాష్, విక్రమ్, దీక్షిత్ పాల్గొన్నారు.

సోమేశ్వర కొండపై భక్తుల సందడి



సోమేశ్వర కొండ వద్ద భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీకనక సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మల్లాపూర్, చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే కొండపై భక్తుల రాక మొదలైంది. కోనేరులో పుణ్యస్నానం చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు బల్యాపెల్లి ప్రభాకర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మల్లాపూర్ మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి–గంగు దంపతులు అందించిన విరాళంతో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సంగ రాజన్న తెలిపారు. ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



వరికి తెగులు.. రైతన్న బేజారు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో వరిపంటకు మొగిపురుగు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికి జింకులోపం, వేరుకుళ్లు, మొగిపురుగు సోకడంతో రసాయన ఎరువులు పిచికారీ చేసినప్పటికీ కోలుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఈ 15 రోజుల వ్యవధిలోనే మూడుసార్లు వరిపొలాల్లో రసాయన ఎరువులు పిచికారీ చేసినప్పటికి ఫలితంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయల పెట్టుబడి నష్టపోయామని రైతులు దిగులు చెందుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : యోగీతా, మండల వ్యవసాయ అధికారి, కథలాపూర్, ఫోన్ నంబర్ 72888 94145

ఘనంగా వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం



జగిత్యాల: శోభాయాత్రలో మహిళలు



రాయికల్: పూజల్లో పాల్గొన్న మహిళలు



మల్లాపూర్ వాసవీమాత ఆలయంలో..



మెట్‌పల్లి: హోమంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని వాసవిమాత ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. మార్కెట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 108 గంగనాల చక్కెరతో మహిళతో ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వైశ్య సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.

మల్లాపూర్ మండల కేంద్రంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యక పరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలతో పాటు మహిళలచే కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం యజ్ఞశాలలో చండిహోమం, అన్నదానం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శివరాంకిషన్, వాసవీక్లబ్ మండల అధ్యక్షుడు మేడి రాకేశ్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు శివ శ్రీనివాస్, సభ్యులు నూనె ఆంజనేయులు, మేడి రాకేశ్, విశ్వప్రసాద్, సోమ అశ్విన్, గోపి, కస్తూరి సంతోష్, నూనె శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో సోమవారం వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో సోమవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. పురోహితులు భాస్కర్‌శర్మ, బాలకృష్ణశర్మ, కృష్ణప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశనం, స్థాపితదేవతార్చన, అభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోట సుమన్ ఉన్నారు.

నడికుడ మల్లన్నస్వామి జాతర ఉత్సవాలు



బోనాలతో భక్తులు

మల్లాపూర్: మండలంలోని నడికుడ శ్రీమల్లన్నస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం గ్రామస్తులు పెద్దసంఖ్యలో బోనాల(సల్లకుండల)తో తరలివచ్చి మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ భూక్య రుక్మా మాట్లాడుతూ మల్లన్నస్వామి జాతర ఉత్సవాలను 5 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న రథయాత్ర, 25న అగ్నిగుండాలు, 26న నైవేద్యం సమర్పించడంతో జాతర ఉత్సవాలు పూర్తవుతాయన్నారు. ఉపసర్పంచ్ దేవుడి గంగాధర్, నాయకులు భూక్య రవి, సంతోష్‌రెడ్డి, మీసాల దేవయ్య, ముద్దం రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లీకేజీతో వృథాగా భగీరథ



మెట్‌పల్లి: పట్టణంలోని బోయవాడలో మిషన్ భగీరథ పైపులైన్‌కు సోమవారం లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో భారీగా నీరు వృథాగా పోయింది. ఈ నీటితో స్థానిక వీధులు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తరచుగా పైపులైన్లు లీకేజీ అవుతుండడంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతోంది. పనులు నాసిరకంగా చేపట్టడంతోనే లీకేజీలు ఏర్పడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కంటి వెలుగును వినియోగించుకోండి

కథలాపూర్: కంటివెలుగును వినియోగించుకోవాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. మండలంలోని తక్కళ్లపెల్లిలో సోమవారం కంటివెలుగును పరిశీలించారు. జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ మొలిగె లక్ష్మి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామపూర్‌లో కంటి వెలుగును ఎంపీపీ జాజాల భీమేశ్వరి ప్రారంభించారు. వైస్‌ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచు తలారీ మనీష, ఎంపీటీసీ బొరిగం వివేకవర్ధిని, ఎంపీడీవో ప్రభు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దశరథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని దోమలకుంట, నందగిరి గ్రామాల్లోని కంటివెలుగు శిబిరాలను ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్ సందర్శించారు.